విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఈవీఎం, వీవీప్యాట్ గోదాము భద్రతకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల) భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఎన్నికలు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ కృతికా శుక్లా, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ క్షంలో క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని కలెక్టరు వివరించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబు (టీడీపీ), రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), సబ్బారపు అప్పారావు (బీఎస్పీ) సీహెచ్ రమేష్ బాబు(భాజపా), టీవీఆర్.సాచి (ఆప్), కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం-స్పందనకు 273 అర్జీలు

విశాలాంధ్ర - కాకినాడ : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు డా కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, సీపీవో పీ త్రినాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం డీ పుష్పమణి, డీపీవో కె. భారతి సౌజన్యలతో కలిసి హాజరై జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కరించవలసిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలు జారీ చేసారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మందికి కారుణ్య నియామకాలు

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద తొమ్మిది మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. వీరిలో ఒకరికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోని బాధిత కుటుంబ సభ్యునికి ఉద్యోగ నియామక పత్రం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం తొమ్మిది మందిలో ఐదుగురికి జూనియర్ సహాయకులుగా, నలుగురికి ఆఫీస్ సబార్డినేట్‌గా నియామక పత్రాలు అందజేశామన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని కలెక్టరు ఈ సందర్భంగా అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, ఇన్చార్జి డీఆర్వో కె. శ్రీరమణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జీఎస్ఎస్. శ్రీనివాసు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చేసిన ద్రోహమే కెనాల్ రోడ్డుకు శాపం

విశాలాంధ్ర - అనపర్తి : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా చేసిన పాపమే కెనాల్ రోడ్డు ప్రయాణికులకు శాపంగా మారిం దని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, వైయస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) విమర్శిం చారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో రాంబాబు విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ వేమగిరి- సామర్లకోట కెనాల్ రోడ్డు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.220 కోట్లు వరల్డ్ బ్యాంక్ నిధులు మంజూరైనట్టు తెలిపారు. పనులు ప్రారంభించే సమయానికి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద పెద్ద మొత్తంలో నిధులు దోచుకున్నారని విమర్శించారు. దీంతో కెనాల్ రోడ్డు అభివృద్ధికి అన్ని దారులు మూసుకుపోయాయని దీనికి ప్రధాన కారణం టిడిపి ప్రభుత్వం చేసిన పాపమే కెనాల్ రోడ్డుకు శాపంగా మారిందని రాంబాబు ధ్వజమెత్తారు. ప్రయాణికులు ప్రయాణించడానికి వీలు లేకుండా రోడ్డు పరిస్థితి నెలకొనడంతో నియోజకవర్గ పరిధిలో అనపర్తి-బిక్కవోలు మధ్య రెండుసార్లు ప్రభుత్వ, ఒకసారి ఎమ్మెల్యే సత్తి సొంత నిధులతో మరమ్మతులు చేయించినట్టు రాంబాబు తెలిపారు. కెనాల్ రోడ్డు అభివృద్ధి విషయంలో ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యే అధికారంలో ఉన్నప్పుడు రోడ్డు నాశనానికి కారణమయ్యారే తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు.

అన్న క్యాంటీన్‌లో భోజనాల పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం పేదలకు భోజనాలను పంపిణీ చేశారు. ప్రతి సోమవారం జగ్గంపేటకు వివిధ ప్రాంతాల నుండి వస్తారని, వారి ఆకలి తీర్చాలనే ఉద్దేశ్యంతో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సోమవారం అన్న క్యాంటీన్ పేరుతో భోజనాలు పంపిణీ చేస్తున్నారు. గత వారం వలే ఈ వారం కూడా టీడీపీ నాయకులు కంది తాతాజీ, జె. కొత్తూరు బంకు యజమాని శ్రీనివాస్ సహకారంతో పేదలకు ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, వేముల కొండ జోగారావు, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు

విశాలాంధ్ర - పిఠాపురం రూరల్ : బాదం మాధవరావు బాలికల పాఠశాలలో పిఠాపురం మండలం ఎంఈఓ వరప్రసాద్ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు 19 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థుల మేధాశక్తితో తయారు చేసిన అనేక ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకు న్నాయి. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే సైన్స్ ఫెయిర్ వంటి పిల్లల్లో ఉన్న సృజనాత్మకశక్తి వెలికితీయడానికి బాగా ఉపయోగపడుతున్నా యన్నారు. ఇటువంటి ప్రదర్శనలో పాల్గొంటే పోటీతత్వం పెరిగి గెలవాలని దృఢ సంకల్పం ఏర్పడు తుందన్నారు. ఈ సైన్స్ ప్రదర్శనలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలకు చెందిన బిహెచ్ ఉమా జ్యోతి, జడ్పీహెచ్ చెందిన జిఎల్‌వి కుమార్, ఓబిఎస్ ఎంపిఎల్‌హెచ్‌కు పివి రమణకుమారి, టీచర్స్ విభాగానికి చెందిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జడ్పీహెచ్ మల్లంకు చెందిన దుర్గా సతీష్, ఎస్‌సిబిఆర్‌హెచ్‌ఎస్ స్కూల్ వి. విజయేశ్వరి, జడ్పిహెచ్ఎస్ చెప్తున్నాడుకు చెందిన ఏవిడి రామతులసిల గ్రూపులకు చెందిన విద్యార్థినిలకు బహుమతులు అందుకొన్నారు. బాదం మాధవ్, టి. నవీన, డాక్టర్ బి. వర్షిని, ఆర్ అంబేద్కర్ గురుకులంకు చెందిన డి. రోజా, ఎంపిఎల్ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన తేజు, అమృతలకు బహుమతులు ఎంఈఓ చేతుల మీదుగా అందుకున్నారు. జి. శ్యాంబాబు, ఎం. లీలాదేవి, ఆర్. జానకి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆర్తనాదాలు వినబడవా?

- ఏజెంట్ల ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా
- కలెక్టరేట్‌కు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నం
- అడ్డగించిన పోలీసులు

విశాలాంధ్ర - కాకినాడ : అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం దగ్గరలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామి రెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్‌లు హాజరయ్యారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలైన కస్టమర్లు, ఏజెంట్లు ఆధ్వ ర్యంలో ప్రదర్శన ధర్నా జరిగింది. ముందుగా స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం, జిజిహెచ్, జడ్పీ సెంటర్ మీదుగా ప్రదర్శన చేస్తూ జిల్లా కలెక్టరేట్‌కు చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డగించారు. పోలీసులకు అగ్రిగోల్డ్ బాధితులకు వాగ్వివాదం జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ తోకల ప్రసాద్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌లో ప్రజలు దాచుకున్న సొమ్ము ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుని హోదాలో ఉన్నప్పుడు 2017 మార్చి 23న ఆమరణ దీక్షపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేసిన సందర్భంగా తన ప్రభుత్వం వచ్చాక మరణించిన బాధిత కుటుంబాలకు పది లక్షల ఎక్స్‌గ్రేషియా పూలలో పెట్టి ఇంటికి పంపిస్తానని, చేసిన వాగ్దానం మేరకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా పది లక్షల రూపాయలు చెల్లించి మరణించిన వారి బిడ్డలను, కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు అన్నింటికీ ప్రభుత్వం పూర్తిస్థాయి రక్షణ కల్పించి, వాటిపై వచ్చే ఆదాయాన్ని కోర్టుకు లేక ఎస్క్రోకి జమ చేయాలని, అవ్వ సీతారామారావు తదితరులు అమ్ము కున్న లేక దాచుకున్న ఆస్తులు అన్నింటిని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని, కంపెనీ తప్పుడు పనులకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలతో విజయవాడలో 36 గంటల దీక్ష జరగనున్నదని, ఈ దీక్ష లో బాధిత కుటుంబాలు భాగస్వాములు అవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్పందనలో అందించారు. ఈ కార్యక్రమంలో వైకే రాజు, శేఖర్, కిరణ్, భాగ్యరాజు, అర్జున్, వీర్రాజు, రాజబాబు వీర వేణి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఏడు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యల పరి ష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. 7వ రోజు సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తున్నదని, తక్షణం వీరి న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేయకుండా సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నం చేస్తున్నదని, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో అంగన్వాడీల భవనాల తాళాలు పగలగొట్టి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. కనీస వేతనం సుప్రీంకోర్టు చెప్పిన లెక్క ప్రకారం రూ.26,000 ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు చెల్లించాలని, పెన్షన్ కూడా వీరికి వర్తింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే నిర్లక్ష్యంగా ఉంటే రాబోయే కాలంలో మొత్తం రాష్ట్రంలో ఉన్న కార్మిక వర్గం వీరికి అండగా నిలబడి ఈ ఉద్యమాన్ని సమ్మెను తీవ్రతరం చేస్తామని, రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా తగిన గుణపాఠం జగన్మోహన్‌రెడ్డి చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వందలాదిమంది అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు. అనంతరం ఆర్డీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందిం చారు. ఆర్డీఓ సానుకూలంగా స్పందిస్తూ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని, ఇచ్చిన వినతి పత్రాన్ని ప్రభుత్వం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ పి.అమూల్య, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. విజయ, కె. బేబీ, గంగారత్నం, ప్రాజెక్ట్ నాయకులు రత్నకుమారి, పార్వతి, దైవకృప ధనలక్ష్మి, మణిమాల, రుక్మిణి, పరిపూర్ణ, సుబ్బలక్ష్మి, సమంత, కమని తదితరులు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికుల అవస్థలు

విశాలాంధ్ర - జగ్గంపేట : అసలే సోమవారం ట్రాఫిక్ ఉండే రోజు. అటువంటి రోజున రోడ్డుపై ట్రాఫిక్ ఉండే సమయంలో బస్సు నిలిచిపోతే ఇక చెప్పేది ఏముంది. మండల కేంద్రమైన జగ్గంపేట బ్రిడ్జి అండర్ పాస్ బ్రిడ్జి క్రింద ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బస్‌లో ఉన్న ప్రయాణికులు, కాలేజీ విద్యార్థులు బస్ వెనుక నుంచి నెట్టుకుంటూ కాంప్లెక్స్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ఆర్టీసి బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిచి పోతున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్టీసి యాజమాన్యం స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలన్నారు.

భైరవస్వామి కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండల పంచాయతీ పేరాయిచెరువులో ఇటీవల మృతి చెందిన పెయ్యల భైరవస్వామి కుటుంబాన్ని సోమవారం అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శిం చారు. భైరవ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని భార్య వెంకాయమ్మ, కుమారుడు స్వామినాయుడు కుటుంబ సభ్యులను రమణారావు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్, పెయ్యల బాలయోగి, పడమట శ్రీను తదితరులు ఉన్నారు.

మహిళా లబ్ధిదారులకు పది ఆటోల పంపిణీ

విశాలాంధ్ర - అమలాపురం : జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఉన్నతి మహిళా శక్తి కార్యక్రమం ద్వారా పదిమంది మహిళ లబ్ధిదారులకు రూ.31,16,093 విలువైన పది ఆటో రిక్షాలను సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా స్థానిక కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారత సామాజిక సమానత్వం పాటించు ప్రక్రియలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆటో రిక్షా నడుపుటకు జీవనోపాధి కార్యక్రమంగా ప్రభుత్వం నిర్దేశించిం దన్నారు. దీనిలో భాగంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ 2023-24 కింద ఉన్నతి పథకం ద్వారా పదిమంది మహిళల జీవనోపాధికి ఆటో రిక్షాలు సబ్సిడీపై అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి. శివ శంకర్ ప్రసాద్, ఏపీడీఎం ఎం. జిలాని, ఫైనాన్స్ డిపిఎం విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అంకంపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని అంకంపాలెం గ్రామంలో స్టేజీ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా శ్రీ లక్ష్మి గణపతి, శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పలువురు భక్తులు దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి డయల్ యువర్ కమిషనర్, స్పందనతో పాటు టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, వీధి దీపాలకు సంబంధించి డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 14 దరఖాస్తులు వచ్చాయి. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ నాగ నరసింహారావు అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన, కోర్టు సంబంధ అంశాలు మినహా మిగిలిన సమస్యలను ఎప్పటికప్పుడు నిర్దేశించిన వ్యవధిలో పరిష్కరించి ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు కూడా తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా తమ దరఖాస్తులను అందజేయవచ్చని సూచించారు. కాగా ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు కాల్ చేసి స్థానికంగా ఎదుర్కొనే సమస్యలను వివరించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఈఈలు మాధవి, వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఓ మానే కృష్ణ మోహన్, వివిధ విభాగాతిపతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఆధ్యాత్మికవేత్త వాజ్‌పేయి గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత, సినీ, సీరియల్ నటులు వాజపేయజుల సత్య సాయి (వాజపేయి) (70) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి చేతులు శుభ్రం చేసుకుని ఇంట్లోకి వస్తున్న ఆయనకు గుండెపోటురావడంతో కుప్పకూలి పోయారు. కొవ్వూరులో ఆత్మీయహిత కారిణి సమాజం, కొవ్వూరు మహాజనసభ,జ్ఞాన సరస్వతి ఆధ్యాత్మిక పీఠాన్ని స్థాపించి సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.చిన్నతనం నుండి రంగస్థలం నటుడైన ఆయన వ్యాఖ్యాతగా రాణించారు. సుమారు 40 చిత్రాలు,అనేక బుల్లితెర నాటికలలో నటించి అందరి మన్ననలు పొందారు. గత ప్రభుత్వంలో సెన్సార్ బోర్డు సభ్యునిగా పనిచేశారు. భార్య నళిని ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ప్రముఖ న్యూస్ రిపోర్టర్ దీప్తి వాజ్ పేయి ఆయన పెద్ద కుమార్తె. ఆమెతో పాటు మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బ్రాహ్మణ సేవా సంఘంలో కీలక పాత్ర పోషించిన వాజపేయి మృతి వార్త పట్టణంలో సన్నిహితులను,బంధువులను కలచి వేసింది. సోమవారం హిందూ స్మశాన వాటికలో వాజ్‌పేయి పార్థివదేహా నికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రజా సంతోషాన్ని ఆకాంక్షిస్తూ, ప్రజా సంక్షేమమే ఒక బాధ్యతగా స్వీకరించి, ప్రజల అభ్యున్నతికి భారత మాతా సేవా పరిషత్ అధ్యక్షులు గొరకపూడి చిన్నయ్య దొర కృషి చేయడం జరుగుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పోతుల రామారావు పేర్కొన్నారు. సోమవారం సామర్లకోట భారత మాత సేవా పరిషత్ కార్యాలయం నందు చిన్నయ్య దొర వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆప్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 10 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాలను చిన్నయ్య దొర చేపట్టడం అభినందనీయమన్నారు. నిత్యం చేపట్టే సేవా కార్యక్రమాలలో భాగంగా సుమారు 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చిన్నయ్య దొర పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ సిబిఐ అధికారి జేడి లక్ష్మీ నారాయణ హాజరుకావాల్సి వుండగా ఆయన హాజరై కార్యక్రమం వాయిదా పడిందని అయన పేర్కొన్నారు.

కొవ్వూరులో వేగంగా పుంజుకుంటున్న బీజేపీ

విశాలాంధ్ర-కొవ్వూరు : నియోజకవర్గ కేంద్రమైన కొవ్వూరులో బీజేపీ వేగం పుంజుకుంటోంది. కొవ్వూరుకు చెందిన యువ నాయకుడు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగారు. కొవ్వూరుకు చెందిన ముస్లిం వర్గం యువ నాయకుడు మైనార్టీ విభాగం జిల్లాస్థాయి అధ్యక్ష పదవిని చేపట్టటం విశేషంగా పేర్కొనవచ్చు. ఎస్సీల విభాగంలోని నాయకులు కూడా అసెంబ్లీ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు పట్టణ అధ్యక్షుడిగా కొనసాగిన నాయకుడు తనదైన శైలిలో పార్టీని నడిపించి ఇప్పుడు కొవ్వూరు అసెంబ్లీ కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షునిగా ఎంపికైన వ్యక్తి ప్రధాన ఉపాధ్యాయునిగా వృత్తిలో పదవి విరమణ పొంది కొత్తగా నాయకత్వం చేపట్టారు.కొద్ది రోజుల క్రితం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు రాష్ట్ర స్థాయి నాయకులు హాజరు కావడం విశేషంగా పేర్కొనవచ్చు. మిగతా పార్టీలలా బిజెపిలో వర్గపోరు లేకపోవడం గమనార్హం. పట్టణంలో 9వ వార్డు నుంచి కౌన్సిలర్ గా బరిలో నిలిచిన ప్రముఖ న్యాయవాది అత్యధిక మెజార్టీతో గెలుపొందటం పట్నంలో బిజెపి పట్ల ఉన్న ఆదరణను తెలియపరుస్తుంది.

స్పందనలో 32 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : నగరపాలక సంస్థ పరిధిలో స్పందనలో వచ్చిన ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా సత్వరం పరిష్కరించనున్నట్టు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, పేర్కొన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి 32 అర్జీలను మున్సిపల్ కమిషనర్ తరపున అదనపు కమిషనర్ స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా పీఎం సత్యవేణి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో సత్వర పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది జవాబుదారీ తనంతో కూడి సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి కొరకు, డ్రైనేజీ, సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు, భూ సర్వే వంటి పలు సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. రాజమహేంద్రవరం, సుభాష్ నగర్‌కు చెందిన మంగ వెంకట రమణ, నన్నయ రోడ్డు ను బీటీ రోడ్డుగా మార్చాలని, వీధి దీపాలు వెలగడం లేదని, పారిశుద్యం, మంచినీరు, రోడ్ల తదితర అంశాలపై 32 వినతులు స్వీకరించామన్నారు. స్పంద నలో సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎ. చైత్ర వర్షిని మాట్లాడుతూ ప్రజా సమస్యలను డివిజన్ స్థాయి అధికారులు నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి పొలం రీ సర్వే, రెవెన్యూ, డ్రైనేజీ, త్రాగునీరు తదితర అంశాలకు సంబంధించి నలుగురి నుంచి రెవిన్యూ డివిజనల్ అధికారిణి చైత్ర వర్షిణి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిస్కారం కొరకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం స్పందన, జేకేసి, ఇప్పుడు జగనన్న సురక్ష ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ సి సబ్ కలెక్టర్ కార్యాలయ, రాజమహేంద్రవరం, తహసిల్దార్ డి. సుగుణ, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి జిఎఎల్ఎస్. దేవి, మునిసిపల్ కార్పొరేషన్, డివిషనల్ పంచాయతీ అధికారి, సివిల్ సప్లైస్, ఐసిడిఎస్, బిసి వెల్ఫేర్, హౌసింగ్, ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూఎస్, ఫైర్, సాంఘిక సంక్షేమ, వైద్య, ఆరోగ్య, లేబర్, పశు సంవర్ధక, పరిశ్రమలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆటో డ్రైవర్లు ఆర్థికసాయం

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో శ్రీ లక్ష్మీగణపతి ఆటో వర్కర్స్ యూనియన్లో సభ్యునిగా ఉంటు ఇటీవలే మృతి చెందిన ఆటో డ్రైవర్‌కు తోటి ఆటో డ్రైవర్లు ఆర్థిక సాయన్ని అందించి తమ సఖ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు చిలకసాని రాంబాబు, కార్యదర్శి వంక మల్లికార్జునస్వామి మాట్లాడుతూ తమ యూనియన్లో సభ్యుడైన అక్కిరెడ్డి రామకృష్ణ ఇటీవలే గుండె పోటుతో అకాల మరణం చెందినట్లు చెప్పారు. దీంతో ఆటో యూనియన్ డ్రైవర్స్ ఆర్థిక సహాయంతో రు.50 వేలు మృతుడి కుటుంబానికి అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తణుకు శివ, శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలులోనికి వస్తే భూ కబ్జాదారులు పెరుగుతారని టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంటమని రామకృష్ణ అన్నారు. న్యాయవాదులు చేపట్టిన దీక్షకు టిడిపి నేతలు సంఘీభావం తెలియజేశారు. రైతులు పేద ప్రజలు తీవ్ర నష్టపోతారని ప్రజా వ్యతిరేకమైన చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 27/2023 యాక్ట్ అమలులోనికి వస్తే పేద ప్రజలు, రైతుల జీవితాలు రోడ్డున పడతాయని వెంటనే ల్యాండ్ టైటలింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

తీపర్రులో భారత వికసిత్ యాత్ర

విశాలాంధ్ర-పెరవలి : మండలంలోని తీపర్రు గ్రామంలో సోమవారం భారత్ వికసిత్ యాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమంలో సింహాద్రి సత్యనారాయణ, కరుటూరి సుబ్బారావు, భోగవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బద్దిరెడ్డి వంశీకులచే మహా అన్నదానం

విశాలాంధ్ర-గోకవరం: గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన బద్దిరెడ్డి వంశీయులు ఫజుల్లాబాద్ శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం వద్ద అన్నదానం నిర్వహిం చారు. 5 వేల మందికి పైగా ఈ అన్నదానంలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఎంతో మహిమగల దేవుడని, కోరిన కోర్కెలు తీర్చే నిజ స్వరూపుడని, ఈ స్వామికి సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవస్థానం వద్ద బదిరెడ్డి వంశీకులు తరతరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్దిరెడ్డి వంశీకులైన అచ్చన్నదొర, శ్రీకృష్ణ, సర్పంచ్ అప్పన్నదొర, నాని, సుబ్బారాయుడు, ఫణి, మాజీ సర్పంచ్ రెడ్డమ్మ, అగ్రికల్చర్ చైర్మన్ నాగ వెంకటేశ్వరరావు, మెహర్ బాబా,పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్, సత్యనారాయణ చేతుల మీదుగా జరిగింది.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో ఆత్రేయపురం మండలంలోని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిలా, రెవెన్యూ డివిజనల్ అధికారి, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం వారి ఆదేశముల మేరకు 20వతేదీ నుండి తేదీ 27వరకు, ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక గ్రామ పంచాయతీ పరిధి నుండి ర్యాలి గ్రామ పంచాయతీ పరిధి వరకు ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుటకు కొరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సునకు హాజరు కావలసినదిగా ఆర్ఐ బి. భవాని, మండల తహసీల్దార్ డి. అనిల్ కుమార్ తెలిపారు.

జయమ్మకు కాపా రూ. 50వేల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-చాట్రాయి: తెలుగుదేశం పార్టీ పోరాట యోధురాలు, సీనియర్ నాయకురాలు పోతనపల్లి మాజీ సర్పంచ్ మందలపు జయప్రద(జయమ్మ) కుమారుడు కాంతారావు ఇటీవల మృతి చెందడంతో నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాస రావు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. సోమవారం మధ్యాహ్నం చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామంలో వారి నివాసానికి వెళ్ళిన కాపా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మేము మీకుఅండగా వుంటామని జయమ్మకు ధైర్యం చెప్పారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ప్రత్యర్థులకు నిలయమైన పోతనపల్లి గ్రామంలో అవిశ్రాంత పోరాటం చేసిన యోదురాలు జయమ్మ అని కొనియాడారు. చిన్న వయసులో కొడుకు కాంతారావు చనిపోవడం తీరని లోటు అన్నారు. గ్రామ అభివృద్ధికి ఆమె చేసిన సేవలుఎన్నటికీ మరువలేనివి అన్నారు. వయోభారంతో వున్నా పార్టీకే అంకితమై ఉండటం కి మరువలేని చరిత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, రావిచెర్ల మాజీ ఎంపీటీసీ లావు ప్రసాదరావు, సూరేపల్లి నాయకులు మల్లి బాబు, చాట్రాయి మండల టిడిపి నాయకులు కంచర్ల హనుమంతరావు, ఎలికే వెంకటేశ్వరరావు, పోతనపల్లి నాయకులు కొసరాజు అబ్దుల్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర -ఏలూరు: ఈనెల 20న విజయనగరం జిల్లా భోగాపురం లో జరుగనున్న యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలని తేదేపా ఎస్ సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ పిలుపునిచ్చారు. బధవారం ఉదయం గం.6స్థానిక బడేటి చంటి క్యాంపు కార్యాలయం నుండి బయలుదేరి భోగాపురంలో జరిగే లోకేష్ బాబు యువగళం నవశకం బహిరంగ సభకు ఏలూరు నియోజకవర్గం భారీగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పక్షవాతం బాధితునికి గంటా వితరణ

విశాలాంధ్ర -భీమవరం: ఆపదలో ఉన్నవారిని అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకోవడం మానవ ధర్మమని కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికారత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు అన్నారు. సోమవారం శ్రీనివాస థియేటర్ సెంటర్‌లోని తన కార్యాల యం వద్ద పక్షవాతంతో బాధపడు తున్న బాధితునికి రూ. 11 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ కొయ్యలగూడెంకు చెందిన తుపాకుల శ్రీనివాస్ పక్షవాతంతో బాధపడుతున్నట్లు వారి కుటుంబ సభ్యులు తమను సంప్రదించడంతో వైద్య ఖర్చులు నిమిత్తం రూ 11 వేలు వారికి అందించామని తెలిపారు. ఇటువంటి వారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో గంటా నాగలక్ష్మి, తిప్పా ముత్యం, గంటా దుర్గారావు, బొక్కా అప్పారావు, యలమంచిలి శ్రీను, విన్నకోట వినాయక్, రాజు, దొర తదితరులు పాల్గొన్నారు.

యువగళం ముగింపు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువ గళం పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావూరి కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రావూరి కృష్ణ మాట్లాడుతూ డిసెంబర్ 20 వ తేదీన యువ గళం-నవ శకం ముగింపు సభ విశాఖ జిల్లా తగరపువలస వేదికగా నిర్వహిస్తున్నారని,భారీ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం పట్టణం నుండి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం పట్టణం నుండి రెండు మినీ బస్సులు, 40 కార్లు తరలి వెళ్ళటానికిఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము,టీడీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్,టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆకుమర్తి రామారావు,బొబ్బర రాజ్ పాల్ కుమార్,నంబూరి రామచంద్ర రాజు, ,కరటూరి రమాదేవి,చిట్రోజు తాతాజీ,పగడం సౌభాగ్యవతి, అల్లూరి రామకృష్ణ,గుమ్మడి ప్రసాద్ ,పాతూరి అంబేద్కర్ షేక్ నజీర్ ,తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

విశాలాంధ్ర - పెంటపాడు: సుబ్రహ్మణ్యం స్వామి షష్టి సందర్భంగా సోమవారం మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.స్వామి వారిని దర్శించుకోవడానికి పండ్లు, ఫలహారాలతో తెల్లవారుజాము 4 గం. ల నుండి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.ఇక్కడికి వచ్చే భక్తులు కోరుకున్న కోరికలు స్వామివారు తీరుస్తారని వారి నమ్మకం.సంతానం లేని వారికి సంతానం కలగడం, విదేశాలకు వెళ్లే వారికి వీసాలు రావడం,పెళ్లికాని వారికి కళ్యాణం లు జరుగుతాయని భక్తులు నమ్ముతారు.దూర దూర ప్రాంతాల నుండి భక్తులు ఎంతో విశ్వాసంతో ఇక్కడికి వస్తుంటారు.ప్రతి మంగళవారం స్వయంభు స్వామివారికి వెంకన్న మనవడు, మనవరాలు రావిపాటి లక్ష్మణరావు, రత్నాజీ దంపతుల ఆధ్వర్యంలో అభిషేకాలు,అర్చనలు సాంప్రదా యంగా జరుగుతున్నాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా వీరి ఆధ్వర్యంలోనే 6గం.లకి మేళతాళాలతో ఊరేగింపుగా ఉమామహేశ్వరం, మౌంజీపాడు పరిసర గ్రామాల ప్రజలు గుడికి వెళ్లి కళ్యాణం హెూమాలు, స్వామి వారికి అరటి గెలలు,పుట్టమీద 10 మంది చిన్నపిల్లలకు బూరెలు పోశి, హెూమాలు జరిపారు.ఈ కార్యక్రమంలో మద్దుకూరి సత్యనారాయణ, పాతూరి కృష్ణారావు, మద్దుకూరి నాగేశ్వరరావు,కొండ్రెడ్డి హైమావతి, మద్దుకూరి అప్పారావు,పసుమర్తి వెంకట సుబ్బారావు,కోడూరి మంగరాజు,నల్లమాటి కృష్ణ,మద్దుకూరి వెంకట సుబ్బారావు మరియు వెంకన్న,పార్వతమ్మల కుటుంబ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని ముంపులో లేని రామవరం, మేడేపల్లి గ్రామపంచాయతీలలో గిరిజన రైతులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు (అసైన్మెంట్) సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే గౌస్, జిల్లా నాయకులు సిరికొండ రామారావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు.ఆ పార్టీ మండల కార్యదర్శి సోయం చంద్రావు అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపులో లేని భూములకు వెంటనే పట్టాలు ఇచ్చి రైతులకు ప్రభుత్వం నుండి అందే ఫలాలను అందించాలన్నారు. అనేక ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్న పట్టాలు లేకపోవడం వలన రైతులు ప్రభుత్వ సహాయం అందక నష్టపోతున్నారని వాపోయారు. రైతులకు వడ్డీ లేని కొత్త వ్యవసాయ రుణాలు ఇవ్వాలని రైతుల ఎదుర్కొంటున్న పలు సమస్యలు వివరిస్తూ స్థానిక తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఎటిఎంను పునరుద్ధంచాలని మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కట్టం వీరస్వామి, కారం సత్యపతి, మండల నాయకులు కారం బాబురావు, మడకం నాగేశ్వరరావు, కట్టం రాంబాబు, సోయం దుర్గారావు, లంకపల్లి శివ, కారం భాస్కరు, మడకం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో ఓటర్ల జాబితా సవరణ పూర్తి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు.రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాల యం నుండి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, సాధారణ ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్ పి లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముకేశ్ కుమార్ మీనా మాట్లా డుతూ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న దృష్ట్యా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని అంశాలలో సమయాత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలో తొల గింపులు, మార్పులకు అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి కారణాలను దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులకు అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుని, దోష రహిత ఓటర్ల తుది జాబితా రూపొందిస్తామన్నారు.జిల్లా ఎస్ పి డి. మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ కె. ఎస్. ఎస్. సుబ్బారావు, ఆర్డీఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, ప్రభృతులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం సీఎం జగన్ లక్ష్యం

విశాలాంధ్ర-తణుకు : పేదవాడికి మెరుగైన కార్పొరేట్ వైద్యం మరింత చేరువ చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ అవగాహన సదస్సులో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ సీఎం జగన్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాలను అందిస్తున్నారని అన్నారు. అందరికీ సులభంగా వాడుకునేందుకు, మరింత మందికి లబ్ధి చేకూర్చేందుకు ఆరోగ్యశ్రీ యాప్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉందన్నారు. కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పురోగతిలో ఉన్నందున, పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన కార్పొరేట్ ఆరోగ్య సంరక్షణ అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చురుగ్గా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తణుకు నియోజకవర్గ నాయకులు

విశాలాంధ్ర-తణుకు : పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో యువగళం సారధి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో సోమవారం తణుకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, పెందుర్తి నియోజకవర్గ ఇంచార్జి బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అక్రమాలను అన్యాయాలను ఎదిరిస్తూ వారు చేస్తున్నటువంటి కుట్ర రాజకీయాలను అడ్డుకుంటూ ప్రజలకి ఒక భరోసా కల్పించే విధంగా యువతకు భరోసా ఇచ్చే విధంగా యువగళం పాదయాత్ర ద్వారా లోకేష్ దూసుకెళ్తున్నారన్నారు.అన్నారు. యువగళం పాదయాత్రతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. గతంలో పాదయాత్రను అడ్డుకునే విధంగా అనేక రకాల అడ్డంకులు సృష్టించిన ప్రజల ఆశీస్సులతో నారా లోకేష్ పాదయాత్ర కొనసాగింద న్నారు. జరగనున్న యువగళం పాదయాత్ర ముగింపు సభకు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున సభలో పాల్గొని విజయవంతం చేసేలా అందరూ కృషి చేసి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



విశాలాంధ్ర - లింగపాలెం : గ్రామాలలో క్రిస్మస్ సందడి నెలకొంది. లింగపాలెం మండలంలోని ప్రతీ గ్రామంలో, క్రైస్తవుల ఇళ్ళల్లో క్రీస్తు పుట్టుక వేడుక కోసం హడావుడి చేస్తున్నారు. చర్చిలను, ఇళ్ళను విద్యుద్దీపాలతో అలంకరించి స్టార్‌లు ఏర్పాటుచేశారు. రాత్రి సమయంలో సెమీ క్రిస్మస్‌లు నిర్వహిస్తున్నారు. క్రీస్తు జననాన్ని వివరిస్తూ కేరల్స్ తిరుగుతున్నారు. ఈ వేడుకలతో గ్రామాలలో కోలాహలంగా ఉన్నాయి. పెద్దలు, యూత్, పిల్లలు, క్రైస్తవ మత గురువులు ఈవేడుకలలో పాల్గొంటున్నారు. లోక రక్షకుడు క్రీస్తు మానవాళికి మార్గదర్శకునిగా మానవునిగా జన్మించారని ఈ వేడుకల్లో మత బోదకులు ప్రసంగాలు చేస్తున్నారు.

27న శ్రీ ఉమా అమృత లింగేశ్వరునికి జలాభిషేకార్చన

విశాలాంధ్ర - మామిడికుదురు : పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరం అప్పనపల్లిలో కొలువు తీరిన శ్రీ ఉమా అమృత లింగేశ్వరునికి ఈ నెల 27వ తేదీ బుధవారం 108 బిందెలతో జలాభిషేకార్చన, పంచామృత అభిషేకార్చన, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీశివ కేశవ భక్త బృందం సోమవారం తెలిపింది. మార్గశిర మాసం అరుద్ర నక్షత్రం శివుడు ఉద్భవించిన రోజును పురస్కరించుకుని ఈ పూజా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 2005 నుంచి ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఇంత వరకు పద్దెనిమిదేళ్లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 19వ ఏడాదిలో 108 బిందెలతో జలాభిషేకార్చన ఏర్పాటు చేశామని చెప్పారు.

వాడవాడలా ఘనంగా షష్టి వేడుకలు

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో, కరప, వేలంగి, గొర్రిపూడి, తదితర గ్రామాలలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం తెల్లవారు జామునే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి దేవాలయాల వద్ద పోటెత్తారు. కరప గ్రామంలో కొలువుతీరిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్తలు చాగంటి వెంకట్రావు, చాగంటి సూరిబాబు ఆధ్వర్యంలో వేద పండితులు భక్తులకు వేదమంత్రాలతో పూజలు జరిపించారు. కరప మండల తహసీల్దార్‌గా పనిచేసి నేడు డిప్యూటీ కలెక్టర్ హెూదాలో విచ్చేసిన బూసి శ్రీదేవి వారి దంపతులు సుబ్రమణ్య స్వామిని దర్శించుకున్నారు. పండితులు ఆశీర్వ వచనాలతో డిప్యూటీ కలెక్టర్ దంపతులను దీవించారు. కొరుపల్లి గ్రామం పెనుగుదురు మెయిన్ రోడ్డు ప్రక్కన చిక్కాల దొరబాబు ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్యస్వామి 51 అడుగుల ఎత్తు విగ్రహం వద్ద షష్టి వేడుకలు పరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గొర్రిపూడి గ్రామంలో చీకాల సుబ్బారావు, అప్పలరాజు, గంగరాజు, ఆలయ ధర్మకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

షష్ఠి మహెూత్సవాలు

విశాలాంధ్ర - దేవరపల్లి : సుబ్రహ్మణ్యేశ్వర షష్టి మహెూత్సవాలు పురస్కరించుకొని దేవరపల్లిలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్త జనావళి పోటెత్తింది. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకం మహన్యాస పూర్వక ఏకవాద రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు అఖండ వెంకట్రాజు వంశీకృష్ణ నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటల నుండి మధ్యాహ్నం వరకు దాదాపు 15 వేల మంది భక్తులు స్వామివారిని సందర్శించుకున్నారు. మధ్యాహ్నం విష్ణు సహస్రనామ పారాయణ లలితా పారాయణ భజన కార్యక్రమం కోలాట కార్యక్రమం జరిగాయి. భక్తులకు దాతలు ప్రసాదాలు అందజేశారు. దేవరపల్లి ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం చౌడేశ్వరి శిరిడి సాయినాథ్ ఆలయాలలో భక్తులు దైవ దర్శనం చేసుకున్నారు. మండలంలో కురుకూరు పల్లంట్ల త్యాజంపూడి లక్ష్మీపురం ఎర్నెగూడెం చిన్నాయ గూడెం యాదవోల దుద్దుకూరు గౌరీపట్నం బంధపురం సంగాయి గూడెం గ్రామాలలో షష్టి ఉత్సవాలు ఘనంగా జరిగాయి దేవరపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఇరువైపులా సర్పాలు ఉండటంతో ప్రత్యేకతను నెలకొని ఉంది శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కమిటీ భక్తులకు విశేష ఏర్పాటు చేసింది.

ఆలయాలు కిటకిట

విశాలాంధ్ర - అనపర్తి : శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్టి పురస్కరించుకొని సోమవారం మండలం లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిట లాడాయి. సుబ్రహ్మణ్య స్వామిని పూజించిన వారికి 'సర్ప దోషం' నుండి విముక్తి లభిస్తుందని ప్రఖ్యాతి గాంచిన నమ్మకం. తెల్లవారుజామునుండే భక్తులు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు పెద్ద ఎత్తున విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి సుబ్రమణ్య స్వామిని భక్తి ప్రపత్తులతో దర్శించుకున్నారు. కాగా స్థానిక వీర్రాజు మామిడి వద్ద గల శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు.

ఘనంగా అంగరలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండ లంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా కపిలేశ్వరపురం మండ లంలో పలు శైవ క్షేత్రాలు, శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రసిద్ధి గాంచిన అంగర శ్రీవల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంనకు తెల్లవారి ఝామునుండి భక్తులు క్యూ కట్టారు. అంగర దాని పరిసర గ్రామాలనుండి వేలాధి గా తరలి వస్తున్న భక్తులుతో అంగర తీర్థం కిటకిటలాడింది. ప్రతీ యేటా లాగే ఈ యేదాది కీర్తశేషులు కొండపల్లి పంచాక్షరి, గంగాభవాని జ్ఞాపకార్థం వారి వంశీయులు షష్ఠి మహెూత్సవంనకు విచ్చేసిన వందలాది మంది భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. చిన్న కోరుమిల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యం స్వామిశిలా విగ్రహం వద్ద పలువురు భక్తులు వ్రత మాచరించారు. కోరుమిల్లి,కపిలేశ్వరపురం గ్రామాలలో తెల్లవారు ఝామునే గొదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అంగర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ విశిష్టత గూర్చి ఆ ఆలయ పండితులు టి సుబ్రహ్మణ్యం మీడియాకు వివరించారు. అంగర ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది షష్టి మహెూత్సవం సందర్భంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు.

తాటిపర్తిలో ఘనంగా షష్టి ఉత్సవాలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పెండం దొరబాబు సోమవారం గొల్లప్రోలు మండలంలోని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లోని సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యే దొరబాబును మర్యాద పూర్వకంగా ఘనంగా సత్కరించారు. అదేవిధంగా చేబ్రోలు గ్రామంలో సుబ్బారాయుడి షష్టి సందర్భంగా భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. దుర్గాడ శివాలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు వేకువ జామున తీర్థపు బిందితో తీసుకుని వచ్చిన గంగా జలాలతో అభిషేకాలు, సర్పసూక్తంతో పారాయణం, స్వామికి నూతన వస్త్రాలతో వివిధ రకాల పుష్ప మాలికలతో అలంకరణ నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

24న కాపు సమారాధన

విశాలాంధ్ర - కాకినాడ : ఈనెల డిసెంబర్ 24న ఆదివారం ఆత్మీయ కాపు సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు వెల్లడించారు. సోమవారం స్థానిక సంఘ అధ్యక్షులు వాసిరెడ్డి దాసు నివాసంలో ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షులు బసవ ప్రభాకర్ రావు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శిచిట్నీడి శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాస్ మాట్లాడుతూ కార్తీక మాసంలో జరగవలసిన కాపు వన సమారాధన తుఫాన్ కారణంగా వాయిదా వేయడం జరిగిందని అందువల్ల ఈనెల డిసెంబరు 24న ఆదివారం ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డు భవాని నగర్ రోడ్‌లో ఉన్న మన శుభం కాపు కళ్యాణ మండపం ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణంలో యధావిధిగా ఉదయం సెమీ పూజ, అల్పాహారం, పిల్లలకు ఆటల పోటీలు, అనంతరం విందు, ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ మాట్లాడుతూ కాపు, తెలగా, బలిజ, ఒంటరి, కాపు సోదర సోదరీమణులు కుటుంబ సమేతంగా ఈ ఆత్మీయ వన భోజన మహెూత్సవంలో పాల్గొని దిగ్విజంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పిసిపాటి మాధవరావు, మాధవరపు పట్టాభి రామయ్య, అడప ప్రకాష్ నాయుడు, కోశాధికారి రంగనాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రాజానగరం : అర్హుల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు, నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి, కో కన్వీనర్ అడబాల గణపతిరావు అన్నారు. వికసిత భారత సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని చక్రద్వారబంధం, పల్లకడియం గ్రామాలలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు, మహిళలకు అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. నరేంద్ర మోడీ అనేక పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రజలకు తగిన అవగాహన లేదని అధికారులు శ్రద్ధవహించి వివరించాలని సూచించారు. విశ్వకర్మ యోజన పథకం అందరికి నమోదు చేయించాలనే అధికారులకు కోరారు.కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కాలేపు సత్య సాయిరాం, నాయకులు ఆళ్ల శివ నాగరాజు, బోయిడి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు దివ్యాంగులు, వృద్ధాశ్రమానికి మండలంలో పల్లంట గ్రామానికి చెందిన గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు తన భార్య పుష్పావతి జ్ఞాపకార్థం ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాషరావుకు రెండు లక్షల రూపాయల నగదును అందజే శారు. జనార్దన్ రావు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ నగదు అందజేశారు. జనార్దన్‌రావు కుమారుడు గోపాలపురం నియోజకవర్గం వైసీపీ పరిశీ గన్నమని వెంకటేశ్వరరావు ఆయన భార్య పద్మ విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాస్కరరావు మాట్లాడుతూ ఈ విరాళం 2 లక్షల రూపాయలు కొత్తగా నిర్మిస్తున్న దివ్యాంగ బాలుర శాశ్వత వసతి భవన నిర్మాణానికి అందించనున్నట్టు తెలిపారు. దాతలు జనార్ధనరావు, వెంకటేశ్వరరావులను వారి కుటుంబ సభ్యులు అభినందించారు.

సమ్మెలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్లు

విశాలాంధ్ర-గోకవం: గోకవరం మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లు సమ్మెబాట పట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ సిఐటియు అనుబంధం పిలుపుమేరకు బొమ్మూరు జంక్షన్ నుండి జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం వరకు జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ భారీ ర్యాలీగా పాల్గొని ఫీల్డ్ అసిస్టెంట్ యొక్క న్యాయమైన డిమాండ్ల కొరకు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నాలో ప్రధాన సమస్యలైన గత 17 సంవత్సరములుగా పనిచేయుచున్న ఉపాధి హామీ క్షేత్ర సహాయకులుగా కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని సక్రమమైన ఎఫ్ టి ఈ ని అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కు ప్రమాద సమయంలో పది లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని అసెంబ్లీ సాక్షిగా గౌరవ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మా న్యాయమైన ఈ ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ వారికి వినతిపత్రం అందజేయడం జరిగింది.

రక్షణ సేవా సమితి కృషి అభినందనీయం

విశాలాంధ్ర - గోపాలపురం : ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయమందించి ఆదుకోవడంలో రక్షణ సేవ సమితి చేస్తున్న కృషి అభినందనీయమని ఫిలిప్ ఫెయిత్ మినిస్ట్రీస్ అధినేత రెవ.ఎస్.జాషువా బెనహర్, కోలుకుల జాషబా స్టీవెన్ అన్నారు. గోపాలపురం మండల రక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో 12వ ఐక్య క్రిస్మస్ వేడుకలను గోపాలపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు సంస్థ సభ్యులు ఏర్పాటు చేసినన రగ్గులను వితరణ చేశారు. ఈ సందర్భంగా బెనహర్ మాట్లాడుతూ భూమి ఆకాశాలను సృజించిన యెహెూవా, మానవాళి రక్షణకై మనుష్య రూపంలో ఈ లోకంలో జన్మించారని అన్నారు. ఆయన మార్గాలను,బోధనలను ప్రజలు ఆచరణగా తీసుకోవాలని బెనహర్ సూచించారు. గోపాలపురం రక్షణ సేవా సమితి వారి సేవలను ఇతర సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కొలుకుల జాషువా స్టీవెన్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు మంచి స్నేహితునిగా ఈ లోకానికి దిగి వచ్చారని అన్నారు. ఆయనకు ఏమి ఇవ్వకపోయినా ఎల్లప్పుడు కాచి కాపాడేది ఏసుక్రీస్తునని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గల్లా ఎలీషా, కార్యదర్శి తాడేపల్లి యేసురాజు, కోశాధికారి రాజుపాల్, సహాయ కార్యదర్శి రత్నరాజు, ముఖ్యసలహాదారుడు దాసరి రామారావు, శాలెం రాజారత్నం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో వృద్ధి చెందాలి

విశాలాంధ్ర - గోపాలపురం : ఆర్యవైశ్యులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందాలని, ఆర్యవైశ్య సంఘం నూతన జిల్లా అధ్యక్షులు వెలగా శ్రీరామ్మూర్తి తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల 46. మండలాలకు చెందిన ఆర్యవైశ్య సంఘాలకు జిల్లా అధ్యక్షులుగా వెలగా శ్రీరామ్మూర్తికి, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎంపిక చేయడం, అభినందనీయమని, జిల్లా అధ్యక్షునిగా ఎంపిక ధ్రువపత్రాన్ని, ఆర్యవైశ్య జిల్లా నాయకులు అందజేశారు.ఆర్యవైశ్యుల అభివృద్ధికినిరంతరం కృషి చేస్తానని, శ్రీరామమూర్తి అన్నారు.వెలగా శ్రీరామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం పట్ల, జిల్లా వైకాపా నాయకులు, ఆర్యవైశ్య సంఘాల, నాయకులు, మండల నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మార్కెట్ సెంటర్ పరిధిలో గల సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేకువ జాము నుండి భారీ క్యూ లైన్‌లో నిలబడి స్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ అర్చకులు కొండవీటి రాంబాబు, ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

వైభవంగా షష్ఠి మహెూత్సవం -పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర-రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో సంతాన సుబ్రహ్మణ్యస్వామిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సంతాన సుబ్రహ్మణ్యం స్వామి వారి 97వ షష్ఠి మహెూత్సవ వేడుకల్ని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుండే ఆలయానికి భక్తులు పోటెత్తారు. దీనిలో భాగంగా అర్చకులు కొడమంచిలి బాబీ, కొడమంచిలి శివ,బావనిబట్ల శ్రీకాంత్,రామ శాస్త్రి అధ్యక్షతన స్వామివారికి,అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు,పూజలు చేశారు.

సీతానగరంలో: రంగ రంగ వైభవంగా సుబ్రమణ్య షష్ఠి మహెూత్సవం. మండలంలో ముగ్గుళ్ళ గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వల్లీ దేవసేనా సుబ్రమణ్య స్వామి షష్ఠి మహెూత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఓ సోమల శివ విలేకరులతో మాట్లాడుతూ ఉదయం స్వామి వారికి పూజలు నిర్వహించి రకరకాల పూలతో సుందరంగా స్వామి వారిని, గుడి మండపాన్ని అలంకరించారు. గతంలో జరిగిన అల్లర్లు పునరావృతం కాకుండా డి ఎస్పి, సిఐ, ఎస్ఐ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తుతో పాటు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం చేసుకొన్నారు.